చదువు

10

■ e-mail: edc@eenadu.in

హైదరాబాద్

ఈనాడు

బుధవారం మార్చి 20, 2024



జీవ శాస్త్రాల్లో కొలువుకు ఇవిగో అస్త్రాలు!

అంతరిక్షంలో భారత్ విజయాలు కేవలం దేశ ప్రతిష్ఠను దేదీప్యమానం చేయడమే కాదు, విశ్వ అంతరిక్ష విపణిలో మన వాటాను గణనీయంగా పెంచుతున్నాయి. 486 బిలియన్ల డాలర్ల గ్లోబల్ స్పేస్ మార్కెట్‌లో పది బిలియన్ డాలర్లు ఉన్న భారత్ వాటా 2025 నాటికి 10 శాతం మార్కెట్ వాటా కైవసం చేసుకుంటుందని అంచనా. ఈ రంగంలో సైన్స్‌తో పాటు సాంకేతికతను అందిపుచ్చుకున్న యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంది.

- జీవ సాంకేతిక శాస్త్ర రంగం (బయోటెక్నాలజీ) రేసు గుర్రంలా పరుగెడుతోంది. 2023లో 92 బిలియన్ డాలర్లు ఉన్న ఈ రంగం 2030 నాటికి ఏకంగా 300 బిలియన్ డాలర్లకు చేరుతుందని పరిశ్రమ వర్గాల అంచనా. ఆరేళ్లలో మూడింతలు పెరుగుతుందంటే దీనిలో ఎంతగా ఉద్యోగావకాశాలు వెల్లువెత్తుతాయో ఊహించవచ్చు.
- ఫుడ్ టెక్నాలజీ పరిశ్రమ దేశ స్థూల జాతీయోత్పత్తిలో 14 శాతం ఆవరించింది. ఈ రంగ ఎగుమతులు 13 శాతం వరకు విస్తరించాయి. తగిన కోర్సులు చేస్తే తక్షణ ఉద్యోగావకాశాలు సొంతం చేసుకునే రంగంగా ఈ పరిశ్రమ ఆహ్వానం పలుకుతోంది.

ఇలా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అంతర్భాగంగా ఉన్న ఏ ఉపరంగాన్ని తీసుకున్నా అది పురోగమన దిశగా సాగుతోంది. అంటే దీని అర్థం- సుభిక్షమవుతున్న ఈ క్షేత్రాల్లో విద్యావంతులైన యువతకు అపార ఉద్యోగావకాశాలకు ద్వారాలు తెరచి ఉన్నాయని!

కల్పవృక్షం.. ఐటీ రంగం

సైన్స్ స్ట్రీమ్‌లో వివిధ కోర్సులు చేసినవారికి శాస్త్ర, సాంకేతిక రంగాలు ప్రధాన ఉద్యోగ క్షేత్రాలు (కోర్ సెక్టర్లు) అవుతాయి. ఇదికాక, ఏ స్ట్రీమ్‌లో గ్రాడ్యుయేట్ అయినా సహస్ర బాహువులతో స్వాగతం పలికే ఐటీ రంగమనే సాగరం ఎలాగూ ఉంది. తొలిదశలో సైన్స్ స్ట్రీమ్ నుంచైనా...తమకు కావలసిన లాంగ్వేజెస్, టెక్నాలజీ నేర్చుకున్న గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లను ఐటీ కంపెనీలు నియమించుకుంటాయి. తమకు వచ్చే ప్రాజెక్టులు, క్లయింట్లను బట్టి సంబంధిత స్ట్రీమ్ నుంచి వచ్చిన ఉద్యోగులను దానిలోకి తరలిస్తాయి. ఉదాహరణకు భారత అంతరిక్ష దిగ్గజం ఇస్రో ఏదైనా ప్రాజెక్టుకు ఐటీ సాంకేతికత అవసరమై సాఫ్ట్‌వేర్ కంపెనీని సంప్రదిస్తే ఆ కంపెనీ తన ఉద్యోగుల్లో సైన్స్ స్ట్రీమ్ నుంచి ముఖ్యంగా ఫిజిక్స్, స్పేస్ నేపథ్యం నుంచి వచ్చిన ఉద్యోగులను ఏరికోరి ఈ ప్రాజెక్టులోకి తీసుకుంటారు. మిగతా స్ట్రీమ్‌ల నుంచి వచ్చినవారు ఆ పని చేయలేరని కాదు కానీ సైన్స్ గ్రూపుల నుంచి వచ్చినవారు త్వరగా అర్థం చేసుకోగలరని మేనేజ్‌మెంట్ భావిస్తుంది.

ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 90 శాతం కోర్సు పూర్తవుతుండగానే ఉద్యోగాల్లో చేరేందుకు ఇష్టపడతారు. కానీ సైన్స్ గ్రాడ్యుయేట్లలో 90 శాతం మంది పీజీ చేసేందుకే సుముఖత చూపుతారు. ఆర్థిక స్థోమత కలవారు ఆ దిశగా వెళ్లినా, ఉద్యోగం తక్షణ అవసరం ఉండి పై చదువులపై మమకారం తగ్గినవారికి ప్రధాన ఐటీ కంపెనీలు ఆ అవకాశం కల్పిస్తున్నాయి. ఆసక్తిగల ఉద్యోగులకు టీసీఎస్ ఉద్యోగం, ఉన్నత విద్యాభ్యాసం చేసుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ కంపెనీ బిట్స్ పిలానీతో ఉన్న ఒప్పందం మేరకు తమ ఉద్యోగులకు ఆరు గంటలే పని కేటాయించింది. సగం రోజులో ఉద్యోగ బాధ్యతలు ముగించి, మిగతా పూట పీజీ కోర్సును మూడేళ్ల పాటు చదువుకోవచ్చు. ఒకపక్క నెలవారీ జీతమూ వస్తుంది, మరోపక్క పీజీ కూడా పూర్తవుతుంది. విప్రో, ఇతర కంపెనీలు కూడా ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయి.

సబ్జెక్టుపై నిజమైన ఆసక్తి, ఎన్ని గంటలు పనిచేసినా తగ్గని అనురక్తి ఉంటే సైన్స్ స్ట్రీమ్ విద్యార్థులకు రాణింపు ఉంటుంది. అటువంటి వారిని గుర్తించడంలో కంపెనీలు ముందుంటాయి.

ఉద్యోగ ప్రవేశం ఎలా?

ఇంతకీ సైన్స్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగ ప్రవేశం ఎలా? సైన్స్, బయోటెక్నాలజీ, ఫార్మసీ, చదివిన విద్యార్థులను మిగతావారితో సమానంగా ఐటీ కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి.

- గ్రాడ్యుయేషన్ చేసిన సైన్స్ స్ట్రీమ్‌లో డొమైన్ పరిజ్ఞానంపై పటిష్ఠంగా ఉండటం ప్రాథమిక అవసరం.
- దీనితోపాటు ఐటీ నాలెడ్జ్ తప్పనిసరి. ఈ విషయంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చేసినవారిలా ఐటీ నైపుణ్యాలను ఆశించరు కానీ ఎక్సెల్, ఎంఎస్ వర్డ్, పీపీటీ లాంటి ప్రాథమిక కంప్యూటర్ అక్షరాస్యతను కోరుకుంటారు. విద్యార్థి వీటితోపాటు చొరవ, ముందు చూపుతో కంప్యూటర్ లాంగ్వేజ్‌లు, ప్రోగ్రామింగ్ నేర్చుకొనివుంటే అటువంటివారిని ఏ కంపెనీ అయినా వదలదు.
- సైన్స్ గ్రాడ్యుయేట్లను మిగతా గ్రాడ్యుయేట్ల మాదిరి ఎంట్రీస్థాయి ఉద్యోగాల్లోనే ఎంపిక చేసుకుంటున్నారు. అదే ఔషధ, ఆరోగ్యరంగ కంపెనీలయితే క్వాలిటీ అస్యూరెన్స్, క్వాలిటీ కంట్రోల్, సేల్స్ వంటి విభాగాల్లోకి తీసుకుంటాయి. టెక్నికల్ రౌండ్స్ సహా అన్ని రౌండ్స్‌లో మంచి ప్రతిభ చూపి, అధునాతన సాంకేతికతల్లో ఏదైనా ఒకదానిపై ప్రాజెక్టువర్క్ చేసిన అభ్యర్థులను ఔషధ కంపెనీలు ఆర్ అండ్ డీ విభాగంలో నియమిస్తున్నాయి. సహజంగానే మిగతా విభాగాలకంటే ఆర్ అండ్ డీలో ప్లేస్‌మెంట్ కల్పిస్తే ప్యాకేజీ ఎక్కువగా ఉంటుంది.

ప్లేస్‌మెంట్స్ ఏ సంస్థల్లో?

సైన్సెస్‌లో మంచి అకడమిక్ ట్రాక్ ఉండి సబ్జెక్ట రౌండ్స్, సాఫ్ట్ స్కిల్స్‌లో మంచి ప్రతిభ చూపినవారిని పెద్ద కంపెనీలే హైర్ చేస్తున్నాయి.

విప్రో టెక్నాలజీస్, యాక్సెంచర్ టెక్నాలజీ సొల్యూషన్స్, హెచ్.సి.ఎల్. టెక్నాలజీ, కాగ్నిజెంట్ సొల్యూషన్స్, ఐ.బి.ఎం. ఇండియా, జెన్‌ప్యాక్ట్, ఎర్నెస్ట్ అండ్ యంగ్, అపోలో, డెలాయిట్, టి.సి.ఎస్., ఇన్ఫోసిస్ లాంటి కంపెనీల్లో వారి అవసరాలను బట్టి నియామకాలు జరుపుతున్నారు. అభ్యర్థి ప్రతిభ, కంపెనీ అవసరాల ప్రకారం వివిధ హోదాలకు వేర్వేరు ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నారు. టెక్నాలజీ కన్సల్టెంట్స్‌కు రూ.12 లక్షలు, డేటా సైంటిస్ట్‌కు రూ.10 లక్షలు, రిస్క్ అనలిస్ట్‌కు రూ.ఐదున్నర లక్షలు, రిసెర్చ్ సైంటిస్ట్‌కు రూ.3 లక్షలు వేతనం చెల్లిస్తున్నారు.

సైన్స్‌లో సక్సెస్ మార్గం

సైన్స్ నేపథ్యం ఉన్న అభ్యర్థులు కేవలం సబ్జెక్టులనే నమ్ముకుంటే నేటి టెక్నాలజీ శకంలో అవకాశాలు అందిపుచ్చుకోలేరు. తమ డొమైన్ పరిజ్ఞానంతో పాటు కంప్యూటర్ లాంగ్వేజ్‌లు, వర్తమాన టెక్నాలజీపై కనీస అవగాహన, ప్రాథమికంగా పనిచేయగల సామర్థ్యం అలవర్చుకోవాలి.

- అభ్యర్థికి ఆసక్తిగల లాంగ్వేజ్ జావా/ పైతాన్‌లో కనీసం వారం పాటు ప్రాథమిక అంశాలు నేర్చుకోవాలి.
- సింపుల్ కోడింగ్ ఐదు నుంచి ఏడు రోజుల పాటు సాధన చేయాలి. 'కింది వాటిలో ఏది ప్రైమ్ నంబరు?' లాంటి సులభ ప్రశ్నలతో ప్రారంభించి క్రమేపీ స్థాయి పెంచుతూ వెళ్లాలి.
- తర్వాత సమాచార నిర్మితుల (డేటా కన్‌స్ట్రక్షన్స్) అధ్యయనం ప్రారంభించాలి. అరేస్, స్టింగ్స్, స్టాక్స్, క్యూస్ తదితర ఫార్మాట్లను మూడు వారాలపాటు అధ్యయనం చేయాలి. వీటిపై కనీసం 30 ప్రశ్నలను సాధన చేయాలి.
- యూట్యూబ్‌లో కొన్ని కోడింగ్ ప్రాజెక్టులను డౌన్‌లోడ్ చేసుకొని ఒకటికి రెండు సార్లు వీక్షిస్తూ, అధ్యయనం చేయాలి.

ఇప్పుడిక అభ్యర్థి కొంతమేర సిద్ధమైనట్టుగా పరిగణించి క్యాంపస్/ ఆఫ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కి హాజరు కావచ్చు. పోటీ పడుతున్న కంపెనీకి సంబంధించిన గత ప్లేస్‌మెంట్ టెస్టులు అందుబాటులో ఉంటే వాటిని సాధన చేసి ఎంపికకు వెళ్లడం ఇంకా మంచిది.

– యన్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

ఏ కోర్సులకు ఎక్కడ అవకాశాలు?

- బీఎస్సీ, ఎమ్మెస్సీ, డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ చేసిన విద్యార్థులను ఐటీ కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి.
- బీఎస్సీ బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ చేసినవారు ఫార్మా, హెల్త్‌కేర్ రంగ కంపెనీల్లోకి వెళ్లిపోతున్నారు. ప్రొడక్ట్ నాణ్యతా ప్రమాణాలు పరీక్షించే విభాగాల్లో వీరి సేవలు వినియోగించుకొని రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల ప్యాకేజీ ఇస్తున్నారు.
- బీఎస్సీ లేదా ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు చేసి సబ్జెక్టులో పటిష్ఠంగా ఉన్న అభ్యర్థులకు హెల్త్‌కేర్ రంగంలో రిసెర్చర్స్‌గా అవకాశం కల్పిస్తున్నారు. ఫైనాన్స్, మార్కెట్ రిసెర్చ్ విభాగాల్లో నియమిస్తున్నారు. ఈ ఉద్యోగులు సమాచార సమీకరణ (డేటా కలెక్షన్), విశ్లేషణ సేవలు అందిస్తారు.
- ఔషధ, వ్యాక్సిన్ల ఉత్పత్తిలో క్లినికల్ రిసెర్చ్ కీలక ఘట్టంగా అవతరించడంతో సైన్స్ కోర్సులు చేస్తే క్లినికల్ రిసెర్చ్ అసోసియేట్‌గా నియమిస్తున్నారు. ఫార్మా, బయోటెక్నాలజీ, వైద్య పరికరాల ఉత్పత్తి కంపెనీల్లో ఈ ఉద్యోగావకాశాలు ఉంటున్నాయి.
- లైఫ్ సైన్సెస్‌తో పాటు స్టాటిస్టిక్స్ సబ్జెక్టుపై పట్టున్న వారిని ప్రజారోగ్య రంగం, జీవశాస్త్ర రంగాల్లో బయోస్టాటిస్టీషియన్‌గా తీసుకుంటున్నారు. లభ్యమయ్యే సమాచారాన్ని అర్థం చేసుకొని, విశ్లేషించి సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో యాజమాన్యం నిర్ణయాలు తీసుకునేందుకు ఈ ఉద్యోగులు తగిన సమాచారం రూపొందించాలి.
- బయాలజీతో పాటు కెమిస్ట్రీ సబ్జెక్టులను నేర్చుకున్న విద్యార్థులను జీవ శాస్త్రవేత్తలుగా నియమిస్తున్నారు. కణాల పెరుగుదల, విభజన, పోషణ ప్రక్రియలను అధ్యయనం చేసేందుకు వినియోగిస్తున్నారు.

నోటీస్ బోర్డు

ప్రవేశాలు

తెలంగాణ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో ...

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వివిధ కోర్సుల్లో డిగ్రీ మొదటి సంవత్సరానికి మహాత్మా జ్యోతిబా ఫులే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ, తెలంగాణ సాంఘిక సంక్షేమ, తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల్లో ప్రవేశానికి 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు:
బీఎస్సీ (ఎంపీసీ/ఎంఎస్‌ఎస్/ ఎంబీజెడ్‌సీ/ ఎంపీజీ/ ఎంసీఎస్‌ఎస్/ బీటీటీసీసీ/ బీబీసీసీ/ ఎన్‌జడ్‌సీ/ బీజడ్‌జీ/ ఎంఎస్‌డీఎస్/ ఎంఎస్‌ఏఐ అండ్ ఎంఎల్/ ఏఎన్‌పీహెచ్‌బీసీ)
బీకాం, బీఏ/ సీఏ/ జనరల్), బీఏ (ఈపీహెచ్/ హెచ్‌పీసీ/ ఈపీఎస్‌పీఏ/ హెచ్‌ఈసీ/ ఐఆర్‌ఈపీ/ పీపీజీఈపీ), బీహెచ్‌ఎంసీటీ,
అర్హత: ఇంటర్ లేదా తత్సమాన విద్యార్హత.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12-04-2024. **పరీక్ష తేదీ:** 28-04-2024.
వెబ్‌సైట్: https://tswreis.ac.in/

ఏపీ బీసీ గురుకులాల్లో ఇంటర్

విజయవాడలోని మహాత్మా జ్యోతిబా ఫులే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించే 18 బీసీ బాలబాలికల జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాల ప్రకటన వెలువడింది.
మహాత్మా జ్యోతిబా ఫులే ఏపీ బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2024
గ్రూపులు: ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ. **బాలుర సీట్లు:** 1,300 (ఎంపీసీ- 500, బైపీసీ- 360, ఎంఈసీ- 160, సీఈసీ- 280) **బాలికల సీట్లు:** 1,300 (ఎంపీసీ- 500, బైపీసీ- 360, ఎంఈసీ- 160, సీఈసీ- 280)
మొత్తం సీట్లు: 2,600. **విద్యార్హత:** విద్యార్థులు సంబంధిత జిల్లాల్లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలలో పదో తరగతి మార్చి 2024 ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు. **వయసు:** 31.08.2024 నాటికి 17 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ (అనాథ/ మత్స్యకార) ఆధారంగా సీటు కేటాయిస్తారు.
దరఖాస్తు రుసుము: రూ.250. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 31-03-2024.
ప్రవేశ పరీక్ష: 13-04-2024. **వెబ్‌సైట్:** https://mjpapbcwreis.apcfss.in/

కాన్పూర్ షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో ...

నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్, కాన్పూర్ కింది కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
కోర్సుల వివరాలు:
★ పీజీ డిప్లొమా కోర్స్ ఆఫ్ అసోసియేట్‌షిప్ ఆఫ్ నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ షుగర్ టెక్నాలజీ ★ పీజీ డిప్లొమా కోర్స్ ఆఫ్ అసోసియేట్‌షిప్ ఆఫ్ నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ షుగర్ ఇంజినీరింగ్ ★ పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ ఇండస్ట్రియల్ ఫెర్మెంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ ★ పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ షుగర్‌కేన్ ప్రొడక్టివిటీ అండ్ మినిస్ట్రీ మేనేజ్‌మెంట్ ★ పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ప్రాసెస్ కంట్రోల్ ★ పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ ★ షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్ కోర్సు ★ షుగర్ ఇంజినీరింగ్ సర్టిఫికెట్ కోర్సు ★ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్ ★ ఫెలోషిప్ ఆఫ్ ఎన్.ఎస్.ఐ. ఇన్ షుగర్ టెక్నాలజీ / షుగర్ కెమిస్ట్రీ ★ ఫెలోషిప్ ఆఫ్ ఎన్.ఎస్.ఐ. ఇన్ షుగర్ ఇంజినీరింగ్ ★ ఫెలోషిప్ ఆఫ్ ఎన్.ఎస్.ఐ. ఇన్ ఫెర్మెంటేషన్ టెక్నాలజీ
అర్హత: కోర్సులను అనుసరించి సంబంధిత విభాగాల్లో ఇంటర్, డిప్లొమా, బీఎస్సీ, ఏఎంఐఈ, ఏఎన్‌ఎస్‌ఐ, డీఐఏటీ.
ఎంపిక: అడ్మిషన్ టెస్ట్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 08-04-2024.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24-05-2024.
పోస్టు ద్వారా దరఖాస్తులకు చివరి తేదీ: 31-05-2024.
చిరునామా: డైరెక్టర్, నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్, కళ్యాన్‌పుర్, కాన్పూర్.
దరఖాస్తు ఫీజు: రూ.1500, ఎస్సీ/ఎస్టీలకు రూ.1000.
అడ్మిన్ కార్డుల డౌన్‌లోడ్: జూన్ 16 నుంచి.
వెబ్‌సైట్: https://nsi.gov.in/

బీకాం తర్వాత సీఏ ఇంటర్ పూర్తిచేశాను. సీఏ ఫైనల్ క్లియర్ చేయలేకపోయా. 2014 నుంచి క్లియరింగ్ అండ్ ఫార్వర్డింగ్ ఏజెంట్ దగ్గర అకౌంటెంట్‌గా పనిచేస్తున్నా. ఇప్పుడు ఐటీ వైపు వెళ్లాలంటే ఏ కోర్సులు చేయాలి? - మెహరాజ్ షేక్

ఏ కోర్సులతో ఐటీ ప్రవేశం?

■ అకౌంటింగ్, ఫైనాన్స్ రంగాల్లో సాంకేతికత వేగంగా పెరుగుతున్న ఈ తరుణంలో అకౌంటింగ్ నుంచి ఐటీ రంగానికి మారడం పెద్ద కష్టం కాదు. మైక్రోసాఫ్ట్ పవర్ బీఐ, ట్యాబ్లూ వంటి సాఫ్ట్‌వేర్‌లను నేర్చుకోవడం ద్వారా మీ నైపుణ్యాలనూ, తద్వారా ఉద్యోగ అవకాశాలనూ మెరుగుపర్చుకోవచ్చు. మైక్రోసాఫ్ట్ పవర్ బీఐ, ట్యాబ్లూల్లో సర్టిఫికెట్ పొందితే, ఐటీ రంగంలో మొదటి ఉద్యోగాన్ని పొందడం సులువు. వీటితో పాటు మైక్రోసాఫ్ట్ ఎక్సెల్, ఆర్ ప్రోగ్రామింగ్, పైతాన్ ప్రోగ్రామింగ్‌లపై కూడా మంచి పట్టు సాధించాలి. ఒకవేళ పీజీ కోర్సు చేయాలనుకుంటే ఎంకాం (కంప్యూటర్స్) గురించి ఆలోచించవచ్చు. మేనేజ్‌మెంట్, డేటా సైన్స్ రంగాలపై ఆసక్తి ఉంటే, ఎంబీఏ (బిజినెస్ అనలిటిక్స్) చదివితే ఉపయోగకరం. ఈ పీజీతో ఫైనాన్షియల్ అనలిటిక్స్ రంగంలోకి కూడా వెళ్ళవచ్చు. ఇటీవలి కాలంలో కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ రంగాల్లో నైపుణ్యాలున్న వారికి ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇలా కాకుండా మీ క్లియరింగ్ అండ్ ఫార్వర్డింగ్ ఉద్యోగాను భవాన్ని ఉపయోగించి మంచి ఉద్యోగం పొందాలంటే బ్లాక్ చెయిన్/ లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా చదివే ప్రయత్నం చేస్తే మేలు.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

అలెన్ స్కాలర్‌షిప్ అడ్మిషన్ టెస్టులు

రాజస్థాన్ కోటాకు చెందిన అలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ అలెన్ స్కాలర్‌షిప్ అడ్మిషన్ టెస్ట్ (ఏశాట్) ప్రకటన విడుదల చేసింది. 11వ తరగతిలో చేరే విద్యార్థులకు ఈ పరీక్షను మార్చి 24న నిర్వహిస్తారు. వీరికి మార్చి 27 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత బ్యాచ్‌లకు మార్చి 31, ఏప్రిల్‌లో స్కాలర్‌షిప్ అడ్మిషన్ టెస్టులు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని నగరాల్లో నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ బ్రజేష్ మహేశ్వరి తెలిపారు. ఈ పరీక్షలో చూపిన ప్రతిభతో ఫీజులో పది శాతం నుంచి తొంభై శాతం వరకు రాయితీ కల్పిస్తారు. సంస్థ వెబ్‌సైట్ www.allen.ac.in నుంచి పూర్తి వివరాలు పొందవచ్చు.

సింగరేణిలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ - 327 వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

★ మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఈ అండ్ ఎమ్): 42 ★ మేనేజ్‌మెంట్ ట్రెయినీ (సిస్టమ్స్) 07 ★ జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రెయినీ (జేఎమ్ఈటీ) టీ, ఎస్: 100 ★ అసిస్టెంట్ ఫోర్‌మాన్ ట్రెయినీ (మెకానికల్) టీ, ఎస్: 09 ★ అసిస్టెంట్ ఫోర్‌మాన్ ట్రెయినీ (ఎలక్ట్రికల్) టీ, ఎస్: 24 ★ ఫిట్టర్ ట్రెయినీ: 47 ★ ఎలక్ట్రీషియన్ ట్రెయినీ: 98 **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ. **వయసు:** 30 సంవత్సరాల లోపు ఉండాలి. (ఎస్సీ, ఎస్టీ, బీసీ పీడబ్ల్యూడీలకు ఐదేళ్ల సడలింపు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 04-05-2024
వెబ్‌సైట్: https://scclmines.com/scclnew/index.asp

గోవా షిప్‌యార్డ్‌లో నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు

మినీరత్న కేటగిరీకి చెందిన గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జీఎస్ఎల్) 106 నాన్–ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రాత పరీక్ష/ ధ్రువపత్రాల పరిశీలన/ స్కిల్/ ప్రెడ్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఈ పోస్టులకు ఎంపికైనవారిని ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన మూడేళ్ల కాలానికి ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగిస్తారు.

1. **అసిస్టెంట్ సూపరింటెండెంట్ (హెచ్ఆర్)–2:** బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పాసవ్వాలి. లేదా ఏదైనా డిగ్రీతోపాటు పీజీ డిప్లొమా/డిగ్రీ ఇన్ పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ లేబర్ లా అండ్ లేబర్ వెల్ఫేర్/ బీఎస్‌డబ్ల్యూ/ బీఏ (సోషియాలజీ) ఉత్తీర్ణులవ్వాలి. హెచ్ఆర్/అడ్మిన్‌లో ఐదేళ్ల అనుభవం ఉండాలి. గరిష్ఠ వయసు 36 ఏళ్లు.
2. **అసిస్టెంట్ సూపరింటెండెంట్ (హిందీ ట్రాన్స్‌లేటర్)–1:** ఇంగ్లిష్ తప్పనిసరి సబ్జెక్టుగా హిందీ డిగ్రీ చదవాలి. హిందీ నుంచి ఇంగ్లిష్‌లోకి, ఇంగ్లిష్ నుంచి హిందీలోకి అనువాదం చేయడంలో ఏడాది డిప్లొమా ఉండాలి. రెండేళ్ల అనుభవం ఉండాలి. వయసు 33 ఏళ్లు మించకూడదు.
3. **అసిస్టెంట్ సూపరింటెండెంట్ (సీఎస్) –1:** ఇంటర్ కంపెనీ సెక్రెటరీ కోర్సు పూర్తిచేయాలి. రెండేళ్ల పని అనుభవం ఉండాలి. గరిష్ఠ వయసు 33 సంవత్సరాలు.
4. **టెక్నికల్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్) –4:** ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా పూర్తిచేయాలి. రెండేళ్ల పని అనుభవం ఉండాలి. ఆటోక్యాడ్ పరిజ్ఞానం ఉండాలి. వయసు 33 ఏళ్లు మించకూడదు.
5. **టెక్నికల్ అసిస్టెంట్ (ఇన్‌స్ట్రుమెంటేషన్) –1:** ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ డిప్లొమా పూర్తిచేయాలి. రెండేళ్ల పని అనుభవం ఉండాలి. వయసు 33 ఏళ్లు.
6. **టెక్నికల్ అసిస్టెంట్ (మెకానికల్)–4:** మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా పాసవ్వాలి. రెండేళ్ల పని అనుభవం ఉండాలి. ఆటోక్యాడ్ పరిజ్ఞానం ఉండాలి. గరిష్ఠ వయసు 33 ఏళ్లు.
7. **టెక్నికల్ అసిస్టెంట్ (షిప్‌బిల్డింగ్)–20:** షిప్‌బిల్డింగ్ ఇంజినీరింగ్ డిప్లొమా పాసై.. రెండేళ్ల అనుభవం ఉండాలి. ఆటోక్యాడ్ పరిజ్ఞానం ఉండాలి. వయసు 33 ఏళ్లు మించకూడదు.
8. **టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్)–1:** సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమా పాసై.. రెండేళ్ల అనుభవం ఉండాలి. వయసు 33 సంవత్సరాలు.
9. **టెక్నికల్ అసిస్టెంట్ (ఐటీ)–1:** ఐటీ/ కంప్యూటర్ ఇంజినీరింగ్ డిప్లొమా పాసై. రెండేళ్ల అనుభవం ఉండాలి. హార్డ్‌వేర్, నెట్‌వర్క్ సమస్యా పరిష్కార నైపుణ్యం ఉండాలి. వయసు 33 ఏళ్లు మించకూడదు.
10. **ఆఫీస్ అసిస్టెంట్ – క్లరికల్ స్టాఫ్–32:** ఏదైనా డిగ్రీ పాసై.. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఏడాది సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయాలి. నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి. గరిష్ఠ వయసు 36 ఏళ్లు.
11. **ఆఫీస్ అసిస్టెంట్ (ఫైనాన్స్/ఇంటర్నల్ ఆడిట్)–6:** కామర్స్ డిగ్రీ పాసై.. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఏడాది సర్టిఫికెట్ కోర్సు చేయాలి. గరిష్ఠ వయసు 33 ఏళ్లు.
12. **పెయింటర్–20:** పదోతరగతి, ఐదేళ్ల పని అనుభవం ఉండాలి. గరిష్ఠ వయసు 36 ఏళ్లు.
13. **వెహికల్ డ్రైవర్–5:** పదో తరగతి పాసై హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, ఐదేళ్ల పని అనుభవం ఉండాలి. గరిష్ఠ వయసు 36 ఏళ్లు..
14. **రికార్డ్ కీపర్–3:** పదోతరగతి పాసై.. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 6 నెలల కంప్యూటర్ కోర్సు చేయాలి. రికార్డ్ కీపింగ్ పరిజ్ఞానం ఉండాలి. వయసు 33 ఏళ్లు..
15. **కుక్–3:** పదోతరగతితో పాటు కనీసం ఐదేళ్ల పని అనుభవం ఉండాలి. ఇండియన్/ కాంటినెంటల్/ చైనీ